క్లుప్తంగా

అభినందనీయం



కొడకండ్ల: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయమని మాజీ సర్పంచ్ ధరావత్ రాజ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధీర్ నాయక్‌లు అన్నారు. ఆదివారం కొడకండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల వలంటీర్లు గిర్నితండాలోని దుర్గమ్మ ఆలయం, ప్రాథమిక పాఠశాల, మెయిన్‌రోడ్డు పక్కనున్న పిచ్చి మొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. పీఓ డాక్టర్ జాంబ, కిషన్‌నాయక్, హేమాని తదితరులు పాల్గొన్నారు.

హుండీల అందజేత



చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన దాతలు రూ. లక్ష విలువైన స్టీలు హుండీలను ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావుల సమక్షంలో అందజేశారు. ఉదయం హుండీలతో ఆలయానికి చేరుకున్న దాతలు తంగళ్లపల్లి లక్ష్మి–రామస్వామి, నాగప్రవంతి–వేణుగోపాల్ దంపతులు, అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయానికి అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు గనగోణి రమేష్, బుచ్చయ్య, రత్నాకర్‌రెడ్డి, చల్లా వెంకటరమణాదేవి, వీరన్న, హరిశంకర్, కృష్ణ, మల్లికార్జున్, వసంత తదితరులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన విశ్వకర్మలు



జనగామ: హైదరాబాద్ ఉప్పల్‌లో ఆదివారం జరిగిన శ్రీ విశ్వకర్మ భగవానుని హోమం, పూజా కార్యక్రమాల్లో జనగామ విశ్వకర్మలు పాల్గొన్నారు. రంగు లక్ష్మణ చారీ, కాలూరీ మల్లికార్జునచారీ, దీగోజు నరసింహచారి, అనంతోజు బ్రహ్మచారీ, రంగు నరసింహచారి, ఐలా కృష్ణ చారీ అందులో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు.

ఎమ్మెల్యే కడియంను కలిసిన ఎల్‌హెచ్‌పీఎస్ కమిటీ



రఘునాథపల్లి: మండలంలోని లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నూతన కమిటీ ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిశారు. హనుమకొండలో నూతన మండల కమిటీ ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి లంబాడీల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో బంజారా భవన్ మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. తమ వినతికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు భూక్య మాల్యానాయక్, మాజీ సర్పంచ్ బానోత్ వెంకట్‌నాయక్, నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు బతుకమ్మ పోటీలు

పాలకుర్తి టౌన్: మండలం కేంద్రంలో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా నేడు (సోమవారం) మండల ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భోనగిరి రమాదేవి, బొగ్గరపు దివ్యజ్యోతి, కోశాధికారి నాగమళ్ల వనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకర్షణీయంగా బతుకమ్మలను పేర్చిన మహిళలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ రూరల్: కరెన్సీపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని కరెన్సీ పై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ కోరారు. ఈ మేరకు దళిత బహుజన ఉద్యమ నేత విముక్త చిరుతల కచ్చి పార్టీ జాతీయ అధ్యక్షుడు, లోక్‌సభసభ్యుడు తిరుమలవళన్‌కు తమిళనాడు జాతీయ పార్టీ కార్యాలయంలో ఆదివారం వినతి పత్రం అందజేశారు. కాగా, పార్లమెంటులో ఈ అంశంపై మాట్లాడుతానని ఆయన చెప్పినట్లు పరశురామ్ తెలిపారు.

పింఛన్ పరేషాన్

- వేలిముద్రలు, ఐరిస్ నమోదుకాక ఇబ్బందులు



పింఛన్ కోసం పోస్టాఫీసు ఎదుట నిరీక్షిస్తున్న వృద్ధులు

తరిగొప్పుల: బయోమెట్రిక్ విధానంలో వేలిముద్రలు, ముఖ గుర్తింపు పడకపోవడంతో పింఛన్ తీసుకోవాడానికి పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వృద్ధులు పింఛన్ తీసుకునే సమయంలో వేలిముద్రలు పడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడడంతో ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) పద్ధతిని ప్రవేశ పెట్టింది. ఈ ప్రక్రియలో వేలిముద్రలతో పనిలేకుండా ఆధార్ కార్డులో ఉన్న ఫొటోలతో సరిపోల్చడానికి గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీని కోసం పోస్టాఫీసు సిబ్బందికి ఒక మొబైల్ ఫోన్‌ను అందించారు. అందులోకి సిమ్‌ను మాత్రం ఇవ్వలేదు. దీంతో పింఛన్ పంపిణీ చేసేందుకు పోస్టాఫీసు సిబ్బంది నేటికి తమ మొబైల్ ఫోనులను వినియోగిస్తున్నారు. ఇదిలా ఉండగా గత రెండు నెలలుగా పింఛన్ పంపిణీ చేయడంలో ముఖ గుర్తింపు రాకపోవడంతో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 2,580 మంది పింఛన్‌దారులు ఉన్నారు. అందులో వృద్ధులు 1,036,వితంతువులు 963, దివ్యాంగుల 346, గీత కార్మికులు 57, చేనేత కార్మికులు 28, ఒంటరి మహిళలు 68, బీడీ కార్మికులు 81 మంది ఉన్నారు.వీరిలో చాలా వరకు వృద్ధుల ముఖ గుర్తింపు పడకపోవడంతో గత రెండు నెలలుగా పింఛన్ తీసుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి పోస్టాఫీసు కార్యాలయాల ముందు పడిగాపులు కాస్తు ముఖ గుర్తింపు పడకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం పొందిన ఆధార్‌కార్డులో ఉన్న విధంగా ముఖాన్ని సరిపోల్చడానికి కంటిరెప్పలను కొడుతున్నప్పటికీ ముఖగుర్తింపు పడకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాము పడుతున్న ఇబ్బందులకు గ్రహించి పింఛన్ అందేలా చూడాలని కోరుతున్నారు.

రెండు నెలలుగా పింఛన్ తీసుకోలేదు..



రెండు నెలలుగా పింఛన్ తీసుకోలేదు. మందులు కొనుక్కొవడానికి డబ్బులు లేక ఇబ్బందిపడుతున్నాను. ఏదో ముఖ గుర్తింపు అంట.. ఎన్నిసార్లు కన్లు మూసి తెరిసినా రావడంలేదు. పాత పద్ధతిలో పింఛన్ ఇయ్యాలి.

- పురమాని చొక్కయ్య, పింఛన్‌దారుడు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన జంగ సులోచన, సుంకరి ఐలయ్యలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.లక్ష విలువ గల చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి ఆదివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనకయ్య, అర్జుల పోషిరెడ్డి, బృంగి శివకుమార్, కల్వరాజు, సిరిగిరి మహేందర్, పింగిళి ఇంద్రారెడ్డి, భీమానాయక్, గొలుసుల రాజు, కత్తుల సాయిరెడ్డి, సుంకరి యాదగిరి, లూకా ,యాకూబ్, నాం శ్రీనివాస్ పాల్గొన్నారు.



తరిగొప్పుల: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న యాదగిరి

రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ..

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలకు చెందిన గోపగోని నాగరాజు కుమార్తె అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆదివారం ఆ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బత్తిని అశోక్ అందజేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి చొరవతో ఆ కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేయడం జరిగిందని అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కూతురు వైద్య చికిత్సకు ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకటేశ్, ఉప్పలయ్య, యాదగిరి, రామచంద్రు, గట్టయ్య, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



లింగాలఘణపురం: ఎల్‌ఓసీ అందజేస్తున్న అశోక్

‘రిజర్వేషన్లలో ఎస్టీలకు అన్యాయం’

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మండల పరిధిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల స్థానాలకు ఖరారు చేసిన రిజర్వేషన్లలో ఎస్టీ సామాజిక వర్గానికి అన్యాయం జరిగింది. మండల పరిధిలో మొత్తం 9 ఎంపీటీసీ స్థానాల్లో ఒక్క స్థానం కూడా ఎస్టీకి కెటాయించలేదు. రాజ్యాంగం ప్రకారం ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉండగా ఒక్కస్థానం కూడా ఇవ్వకపోవడంపై ఎస్టీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తానేదార్‌పల్లి, జిట్టెగూడెం, చంద్రుతండా, తాటికొండ తదితర గ్రామాల్లో ఎస్టీ జనాభా ఉన్నప్పటికీ రిజర్వేషన్ కేటాయించలేదని పలువురు విమర్శలు చేస్తున్నారు. సర్పంచ్‌ల విషయంలో మొత్తం 15 గ్రామాల్లో వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న చంద్రుతండా, జిట్టెగూడెం గ్రామాలకు ఎస్టీ రిజర్వేషన్లు చేసిన అధికారులు మిగిలిన 13 గ్రామాల్లో ఎస్టీకి ఒక్కస్థానం కేటాయించలేదు. గతంలో ప్రస్తుతం మున్సిపాలిటీలో కలిసిన శివునిపల్లికి సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు ఎస్టీలకు కేటాయించారన్నారు. గత రొటేషన్ విధానంలో చేసినా తానేదార్‌పల్లికి ఎస్టీ ఎంపీటీసీ స్థానం రావాల్సి ఉందన్నారు. అధికారులు ఎస్టీ సామాజిక వర్గంపై చిన్నచూపు చూస్తూ రాజ్యాంగ విరుద్ధంగా రిజర్వేషన్లు ఖరారు చేశారని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి స్టేషన్‌ఘన్‌పూర్ మండల ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు పరిశీలించి ఎస్టీలకు కనీసం ఒక్క ఎంపీటీసీ స్థానమైనా కేటాయించాలని ఎస్టీ సంఘాల నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌డీఓ డీఎస్ వెంకన్నను వివరణ కోరగా పంచాయతీరాజ్ నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిజర్వేషన్లు ఖరారు చేశామని తెలిపారు.

‘దేవాదుల’కు ఒక్క పైసా విడుదల చేయలేదు

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్: దేవాదుల 3వ దశ పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పైసా నిధులు కూడా విడుదల చేయలేదని, తట్టెడు మట్టి కూడా తీయలేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. ఊరూరికి బీఆర్‌ఎస్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని రఘునాథ్‌పల్లి, కూనూర్, ఉప్పుగల్లు, తమ్మడపల్లి (ఐ), తిమ్మంపేట, లక్ష్మీనాయక్‌తండా, ఓబులాపూర్, మగ్దుంతండా, హిమ్మత్‌నగర్, తిమ్మాపూర్, తమ్మడపల్లి (జి), షాపల్లి, సూరారం, తీగారం గ్రామాల్లో రాజయ్య ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జఫర్‌గఢ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవాదుల 3వ దశ పనుల కోసం ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం నయా పైసా నిధులు కేటాయించకపోవడంతో పాటు ఎక్కడికక్కడ కెనాల్ పనులు నిలిచిపోయినప్పటికీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాత్రం నిధులు మంజూరైనట్లు, నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులు వస్తే ప్రజలు కాంగ్రెస్ బాకీ కార్డును చూపించి నిలదీయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ పసునూరి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పల్లెపాటి జైపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి టౌన్: పదో తరగతి వరకు కలిసి చదువుకున్న విద్యార్థులంతా 27 ఏళ్ల తర్వాత ఒక చోట చేరి సందడి చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బాషారత్ గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. పాలకుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో తమకు విద్యాబోధన చేసిన గురువులు ఎం.సోమయ్య, సోమేశ్వర్‌రావు, మహేందర్‌రెడ్డి, యాదగిరి, డి సోమయ్య, సత్యనారాయణ, ఆంజనేయులును ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు చిలుకమారి నాగేశ్వర్, మామిండ్ల రమేష్‌రాజా, జిలుకర తిరుమల్, చారగొండ్ల శివ, గంగు రఘుశర్మ, రేపాల అశోక్, గుండెవేని కుమారస్వామి, డాక్టర్ ఆరూరి మహేందర్, జంపాల రాజు, దిలీఫ్, ప్రవీణ్, గాదెపాక శ్రీను, భాస్కర్ ఉన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: పేదల సంక్షేమమే ధ్యేయంగా పీఎం నరేంద్రమోదీ పాటుపడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో కూనూర్, జఫర్‌గఢ్, ఉప్పుగల్లు, తిమ్మంపేట, షాపల్లి గ్రామాల్లో పీఎం మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తచాటాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బుర్ర తిరుపతిగౌడ్, ఎదులాపురం మదన్‌మోహన్, సింగారపు రమేష్, దుద్దుల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సేవ్‌ఫోరం సభ్యులు

పాలకుర్తి టౌన్: ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు జరిపి యువకులు మానత్వాన్ని చాటుకున్నారు. మండల కేంద్రంలో గుడివాడ అంగడి వీధిలో కొన్నేళ్లుగా ఉంటున్న లక్ష్మి(50) మృతి చెందింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనాథ అయిన లక్ష్మి గ్రామంలో తిరుగుతూ గ్రామస్తులు పెట్టిన భోజనాన్ని తింటూ జీవనం సాగిస్తుంది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. ఈ విషయాన్ని గ్రామస్తులు జీపీ కార్యదర్శి వెంకటచారికి తెలియగా గ్రామానికి చెందిన మామిండ్ల లక్ష్మి సహకారంతో సేవ్ పాలకుర్తి ఫోరం సభ్యులు బండిపెల్లి మధు, దుంపల సంపత్, దేవసాని సురేష్, జీపీ సిబ్బంది పరంజ్యోతి అనాథ మహిళ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

స్వదేశీ, పౌర విధులపై అవగాహన కల్పించాలి

జనగామ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పంచ పరివర్తన కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి సామాజిక సమరసత, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ విలువల సంరక్షణ, స్వదేశీ, పౌర విధులపై అవగాహన కల్పించాలని ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు ఉదయ్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జాగృతి వారపత్రిక సంపాదకులు కుర్ర దుర్గారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. 1000 సంవత్సరాల విదేశీ పాలనలో మన అస్తిత్వం, సంస్కృతి దెబ్బతిన్నా, హిందూ సంఘటన్ ద్వారా వ్యక్తిలో దేశ భక్తి, స్వాభిమానం, త్యాగ గుణం పెంపొందించి గర్వంగా హిందువుని అని చెప్పుకునే స్థాయికి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో దొంతుల శేఖర్, నాగరాజు, మోతె సురేందర్‌రెడ్డి, ఇట్టబోయిన రాజు, రామకృష్ణ, రవికుమార్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.



జనగామ: మాట్లాడుతున్న వక్త



తరిగొప్పుల: శతాబ్ది ఉత్సవాల్లో నాయకులు

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

తరిగొప్పుల: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలో విజయదశమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవాహ బత్తుల నరేందర్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ గడచిన వంద ఏళ్లుగా దేశానికి అనేక రంగాల్లో సేవలు అందిస్తూ జాతీయ భావన, దేశభక్తి పెంపొందిస్తుందన్నారు. డాక్టర్ హెడ్గేవార్ ప్రారంభించిన ఈ సంఘ శాఖలు నేటి వరకు దేశమంతటా వ్యాపించాయన్నారు. భారతీయ కుటుంబ విలువలు, పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రతీ పౌరుడు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్మెట ఖండ సహకార్యవాహ గోలి సతీష్, జిల్లా గోసేవ ప్రముఖ్ ధమ్మన్న గారి మాధవరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పబ్బోజు రాంబ్రహ్మచారి, బాపిరాజు, బోగం శ్రీనివాస్, వినేష్, రాకేశ్ పాల్గొన్నారు.

వ్యక్తి నిర్మాణంతోనే దేశ నిర్మాణం

జనగామ రూరల్: వ్యక్తి నిర్మాణంతోనే దేశ నిర్మాణం జరుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా నాయకుడు గంగార బోయిన ప్రమోద్ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో గానుగుపహాడ్ గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో వెంకిర్యాల, ఎర్రగొల్ల పహాడ్, గ్రామ సంఘ్ స్వయం సేవక్‌లు విజయదశమి ఉత్సవం నిర్వహించారు. మామిడాల అనిల్, సుభాష్, గుర్రం వెంకటేష్, ఎడమ రాజు, శానబోయిన మహిపాల్, కెమిడి శ్రీనివాస్ ఈర్ల నవీన్ కుమార్, కీర్తి అరుణ్, మహేందర్, శ్రీకాంత్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: రఘునాథపల్లి, కుర్చపల్లి, కంచనపల్లి, ఖిలాషాపూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది, విజయదశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురిగల భిక్షపతి మాట్లాడుతూ యావత్ హిందూ సమాజానికి ఆర్‌ఎస్‌ఎస్ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. దేశ హితం కోసం ప్రతి ఒక్కరు విధిగా పంచ పరివర్తన సందేశాన్ని అందుకొని ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు.

పంచ పరివర్తన ద్వారానే సమాజ పరివర్తన సాధ్యం

దేవరుప్పుల: పంచ పరివర్తన ద్వారానే సమాజ పరివర్తన సాధ్యమని జిల్లా ధర్మా జాగరణ ప్రముఖ్ జిలకపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం సింగరాజుపల్లిలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జెన్‌కో ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సేవా, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంద సంస్థ (ఎన్జీఓ)గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల మహేశ్, చంద్రశేఖర్, విజయ్ కుమార్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

జనగామ రూరల్: ఇటీవల సీఐగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణరెడ్డిని ఆదివారం సీపీఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, బూడిద గోపి, చందు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చండీపీఠం నిర్వాహకులకు..

దేవరుప్పుల: దేవి శరన్నవరాత్రోత్సవాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మికత చింతన కోసం పాటుపడుతున్న చండీపరమేశ్వరీ పీఠం ఆధ్వర్యంలో వాసవీమాత ఆలయంలో సువాసిని పూజకుమారీ, బాల పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులను వాసవీ వనితలు ఘనంగా సన్మానించారు.

ఎస్సీ సర్పంచ్ స్థానాల గెలుపునకు పాటుపడాలి



ప్రీతమ్‌తో మహేందర్

దేవరుప్పుల: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ రిజర్వ్ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల గెలుపునకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ విభాగం పాటుపడాలని ఆ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతమ్ సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లో కడవెండికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బాషిపాక మహేందర్ తదితరులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. జనాభా దామాషా ప్రకారం ఆయా సామాజిక వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక అవకాశాలు కల్పించాలని చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే కొందరు అడ్డంకులు సృష్టించే కుతంత్రాలు తగవన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజా ఆశయాలను ప్రతిబింబించే విధంగా ఘనవిజయం సాధిస్తుందని అన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

సాక్షి నెట్‌వర్క్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా భక్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం మండపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు, చండీయాగం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, ఆయా మండపాల వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.



సోమేశ్వరాలయంలో మహాచండీ అవతారంలో అమ్మవారు



జనగామ: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



స్టేషన్‌ఘన్‌పూర్: ఎల్లమ్మగుడి వద్ద చండీయాగం చేస్తున్న భక్తులు



జనగామ: రేణుకా ఎల్లమ్మ ఆలయంలో..



జనగామ: శ్రీ విల్లాస్ కాలనీలో భవానీ మాత అమ్మవారి మండపంలో..



చిల్పూరు: మల్కాపూర్‌లో..




బచ్చన్నపేట: దుర్గామాత విగ్రహ ఊరేగింపు..



జఫర్‌గఢ్: ఓబులాపూర్‌లో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

భగత్‌సింగ్ జయంతి వేడుకలు



జనగామ రూరల్: పట్టణంలోని సంజయ్‌నగర్‌లో భగత్‌సింగ్ జయంతి వేడుకలను భగత్‌సింగ్ యూత్ అధ్యక్షుడు మంతెన మణికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళర్పించారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మరబోయిన పాండు, టీం సభ్యులు అర్జున్ సింగ్, గండి నాగరాజ్, కొంతం శ్రీనివాస్, తాళ్లపల్లి వాసు, మల్లోజు గిరి, పండుగ నరేష్ తదితరులు పాల్గొన్నారు.